కలెక్టర్‌గా పమేలా సత్పతి కొనసాగింపు

కరీంనగర్, జూన్ 24 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లా కలెక్టర్‌గా పమేలా సత్పతిని కొనసాగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ శాంతికుమారి సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. ఇటీవల జరిగిన ఐఏఎస్‌ల బదిలీల్లో సిరిసిల్ల కలెక్టర్‌గా ఉన్న అనురాగ్ జయంతిని కరీంనగర్‌కలెక్టర్‌గా బదిలీ చేశారు. సోమవారం పమేలా సత్పతిని కరీంనగర్ కలెక్టర్‌గానే కొనసాగిస్తూ, అనురాగ్ జయంతిని జీహెచ్ఎంసీ కార్యాలయం జోనల్ కమిషనర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి.

కాంగ్రెస్ గూటికి జడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ?



కరీంనగర్ టౌన్/ ఇల్లందకుంట, జూన్ 24: జిల్లా ప్రజా పరిషత్ అధ్యక్షు రాలు కనుమల్ల విజయ బీఆర్ఎస్ పార్టీకి గుడ్‌బై చెప్పి కాంగ్రెస్‌లో చేరుతారని ప్రచారం జరుగుతోంది. సోమవారం ఆమె మంత్రి పొన్నం ప్రభాకర్‌ను హుస్నాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. బీఆర్ఎస్ పార్టీని పలువురు నాయకులు, ఎమ్మెల్యేలు వీడి ఇతర పార్టీల్లో చేరుతున్న క్రమంలో విజయ కూడా కాంగ్రెస్‌లో చేరుతారని, ఆమెతోపాటు కొంత మంది జడ్పీటీసీలు హస్తం పార్టీలో చేరేందుకు సిద్ధమవుతున్నారని ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఈ విషయంపై జడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయను సంప్రదించగా జూన్‌లో చివరి జడ్పీ సర్వసభ్య సమావేశం ఉందని, అందుకు మంత్రి పొన్నం ప్రభాకర్‌ను సమావేశానికి ఆహ్వానించేందుకు మర్యాదపూర్వకంగా కలిసినట్లు తెలిపారు. మంత్రి పొన్నం ప్రభాకర్ జూన్ 2న సమయం ఇచ్చారని చెప్పారు.

నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- బీజేవైఎం ఆధ్వర్యంలో ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న కార్యకర్తలను అడ్డుకుంటున్న పోలీసులు

గణేశ్‌నగర్, జూన్ 24: నిరుద్యోగుల సమస్యలు పరిష్కారించాలని కోరుతూ భారతీయ జనతా యువ మోర్చా కరీంనగర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో సోమవారం తెలంగాణ చౌక్ లో ఆందోళన నిర్వహించి రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు దురిశెట్టి సంపత్ మాట్లాడుతూ నిరుద్యోగులు సమస్యలతో సతమతమవుతుంటే రాష్ట్ర ప్రభుత్వం చోద్యం చూస్తోందని విమర్శించారు. పదేళ్ల రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడిందన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలకు గడిచినా ఏ ఒక్క సమస్యలను పరిష్కరించలేదని, నిరుద్యోగ భృతి విషయమే మర్చిపోయిందని విమర్శించారు. బీజేవైఎం నాయకులపై రాష్ట్ర ప్రభుత్వం దాడి చేయించడం అమానుషమని అన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎడవెల్లి శశి, నాయకులు గుండరాపు సంపత్, అజయ్, తోట సాయి, అనిల్, మహేష్, హరీష్, ప్రసన్న, శివరెడ్డి, ప్రవీణ్, కుమార్, శ్రీనివాస్, రాము, రమేష్ పాల్గొన్నారు.

అర్ధరాత్రి.. విచ్చలవిడిగా..

నగరంలో రోడ్లపైనే బర్త్‌డే వేడుకలు, బైక్ రేస్‌లు

- జంక్షన్లు, శివారు ప్రాంతాల్లో ఫొటో షూట్‌లు, ఇన్‌స్టా రీల్స్
- రాత్రివేళ వాహనదారులకు ఇక్కట్లు
- గస్తీ పెంచాలంటున్న ప్రజలు



కరీంనగర్ క్రైం, జూన్ 24 : కరీంనగర్‌లో ఇటీవల కాలంలో అర్ధరాత్రి సమయాల్లో రోడ్లపై బర్త్‌డే వేడుకలు, జంక్షన్లు, శివారు ప్రాంతాల్లో ఇన్‌స్టా రీల్స్ షూటింగ్, ఫొటో షూట్‌లు, బైక్ రేస్‌లు పెరిగిపోయాయి. వాహనదారులు, నగర ప్రజలకు ఇవి ఇబ్బందికరంగా పరిణమిస్తున్నాయి. రాత్రి వేళ ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం యువతకు ఒక ఫ్యాషన్‌గా మారిపోయింది. వీటికితోడు శివారు ప్రాంతాల్లో రాత్రి వేళ మద్యం, మత్తు పదార్థాలు సేవించినవారు, అల్లరిమూకలు, పోకిరీల ఆగడాలు శృతి మించిపోతున్నాయి. కొద్ది రోజుల కిందట అర్ధరాత్రి సమయంలో విపరీతంగా మద్యం సేవించిన కొందరు యువకులు కారును అతివేగంగా నడుపుతూ ఒకటో ఠాణా ఎదుట డివైడర్‌ను ఢీకొట్టారు. అక్కడే విధుల్లో ఉన్న పోలీసులు వెళ్లేసరికి పరారయ్యారు. కొద్ది నెలల కిందట అర్ధరాత్రి సమయంలో కోర్టు చౌరస్తా నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు కొందరు యువకులు బైక్‌రేస్‌ను నిర్వహించగా మిషన్‌హాస్పిటల్ వద్ద రెండు బైక్‌లు డివైడర్‌ను ఢీకొట్టగా ఇద్దరు యువకులు దుర్మరణంచెందారు. మానేరు బైపాస్‌రోడ్‌లో రాత్రి వేళ కొందరు యువకులు గంజాయి సేవిస్తూ ఆ మత్తులో బైక్ రేస్‌ల్లో పాల్గొంటూ తరచుగా ప్రమాదాలు చేస్తున్నారని స్థానికులు అంటున్నారు. నగర శివారులో చింతకుంట బైపాస్ రోడ్, నైట్ ఫుడ్‌కోర్టు, మానేరు బైపాస్‌రోడ్, తీగల వంతెన, పెద్దపల్లి ఓవర్‌బ్రిడ్జి వద్ద యువకులు బైక్‌రేస్‌లు నిర్వహిసున్నాన్నారు. తీగల వంతెన వద్ద రాత్రి సమయాల్లో ఫొటోషూట్ పేరిట ప్రమాదకర విన్యాసాలు చేస్తున్నారు. తీగల వంతెన, బైపాస్‌రోడ్‌లో రాత్రి సమయాల్లో అక్రమ కార్యకలాపాలు పెరిగిపోయాయి. నగరంలో, నగర శివారు లోని కొన్ని విద్యాసంస్థల వద్ద గంజాయి ముఠాలు అడ్డావేసి అమాయక విద్యార్థులు, యువత, మైనర్‌లకు గంజాయి అలవాటు చేస్తున్నట్లు ఇటీవల జరిగిన పలు ఘటనలు వెల్లడిస్తున్నాయి. మైనర్లు ద్విచక్రవాహనాలను అతివేగంగా నడుపుతూ ప్రమాదాల బారిన పడి తల్లిదండ్రులకు ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఇటీవల కరీంనగర్ ట్రాఫిక్ పోలీసులు వరుసగా తనిఖీలు నిర్వహించి మైనర్లు నడుపుతున్న వంద ద్విచక్రవాహనాలను పట్టుకున్నారు. కేసులు నమోదు చేసి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించి వదిలిపెట్టారు. పోలీసులు రాత్రివేళ గస్తీని ముమ్మరంచేయాలని నగర వాసులు కోరుతున్నారు.

ఆందోళన కలిగిస్తున్న దొంగతనాలు



నగరంలో కొద్ది రోజులుగా వరుసగా దొంగతనాలు నగరవాసులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. వారం రోజుల క్రితం భాగ్యనగర్, విద్యానగర్, సంతోష్‌నగర్, చైతన్యపురికాలనీ ప్రాంతాల్లో గుర్తుతెలియని దొంగలు ఇళ్ల ఆవరణల్లోకి చొరబడి గ్యాస్ సిలిండర్లు, బియ్యం బస్తాలు, ఇనుప గేట్ తదితర విలువైన సామాగ్రిని ఎత్తుకుపోయారు. ఒక అపార్ట్‌మెంట్‌లో పార్క్ చేసి ఉన్న కారును రాత్రి వేళ కొందరు వ్యక్తులు దొంగిలించారు. తాజాగా ఆదివారం రాత్రి కొత్తపల్లి పోలీసు ఠాణా పరిధిలోని రేకుర్తి గ్రామం కాళోజీనగర్‌లో రాత్రి 2 గంటల సమయంలో తాళం వేసి ఉన్న మూడు ఇళ్లలో గుర్తుతెలియని దొంగలు చొరబడి మూడు లక్షల సొత్తును దొంగిలించారు.

అంతర్రాష్ట్ర దొంగల ముఠా

దొంగతనాలకు పాల్పడింది మధ్యప్రదేశ్‌కు చెందిన కరుడుగట్టిన ముఠాగా భావిస్తున్నారు. ఈ ముఠానే ఈ నెల 20న విశాఖపట్నం, 21న హైదరాబాద్‌లలో దొంగతనాలకు పాల్పడినట్లుగా తెలుస్తోంది. పగటిపూట చిరు వ్యాపారులుగా, పాత సామగ్రి కొనుగోలు చేసేవారిగా కాలనీల్లో తిరుగుతూ రెక్కీ నిర్వహిస్తూ తాళం వేసి ఉన్న ఇళ్లను గుర్తిస్తూ అర్ధరాత్రి వేళ దొంగతనాలకు పాల్పడుతున్నట్లు సమాచారం. ఈ ముఠాలో నలుగురు నుంచి 10 మంది వరకు సభ్యులుంటారని, అందరి వద్ద ఇనుపరాడ్లు, ఇతర ఆయుధాలు ఉంటాయని తెలుస్తోంది. దొంగతనాల సమయంలో అడ్డుకోబోయినవారిపై దాడులకు కూడా పాల్పడే అవకాశముంది. మరో ఘటనలో మెహర్‌నగర్‌లో తెల్లవారుజామున ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వచ్చి ఇంటిఎదుట పూలు తెంపుతున్న ఒక వృద్ధురాలి మెడలోని బంగారు పుస్తెలతాడును అపహరించుకుపోయారు. ఇక సెల్‌ఫోన్, పర్సుల దొంగతనాలు కూడా జరుగుతూనే ఉన్నాయి. నగరంలో, నగర శివారు ప్రాంతాల్లో రాత్రి వేళ పోలీసు గస్తీని తీవ్రతరం చేయాలని, కాలనీల్లో గస్తీ దళాలను ఏర్పాటు చేయాలని ప్రజలు పోలీసు అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

సీజనల్ వ్యాధుల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి

- పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలి
- కలెక్టర్ పమేలా సత్పతి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

సుభాష్‌నగర్, జూన్ 24: వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కాన్ఫరెన్స్ హాలులో సీజనల్ వ్యాధుల నియంత్రణపై జిల్లా స్థాయి టాస్క్‌ఫోర్స్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాలు, మున్సిపాలిటీల్లో శానిటేషన్ ప్రక్రియ సజావుగా సాగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని, తాగునీరు కలుషితం కాకుండా పర్యవేక్షించాలన్నారు. దోమల వ్యాప్తిని నివారించాలని, మురికి గుంటల్లో ఆయిల్స్ బాల్స్ వేయాలని ఆదేశించారు. గ్రామాల్లోని మంచినీటి ట్యాంకులను ఎప్పటికప్పుడు శు భ్రం చేయించాలని ఆదేశించారు. వర్షాకాలం నేపథ్యంలో వైద్య సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. ప్రజలు కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. పాఠశాలల్లో బ్లీచింగ్ పౌడర్‌ను అందుబాటులో ఉంచాలని, విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. డెంగీ, మలేరియా వంటి విషజ్వరాలు ప్రబలకుండా పక డ్బందీగా వ్యవహరించాలని సూచించారు. ప్రైవేటు ఆసు పత్రుల వారు వ్యర్థాలను మున్సిపాలిటీ వారికి కాకుండా ఏజెన్సీ వారికి అప్పగించాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుజాత, డీపీవో రవీందర్, జడ్పీ సీఈవో శ్రీనివాస్, మిషన్ భగీరథ ఈఈ అంజన్‌రావు పాల్గొన్నారు.

ప్రైవేటు ఆసుపత్రులు నిబంధనలు పాటించాలి

ప్రైవేటు ఆసుపత్రుల నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలు కచ్చితంగా పాటించాలని కలెక్టర్ పమేలాసత్పతి అన్నారు. సోమవారం కలెక్టర్ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా రిజిస్ట్రేషన్ అథారిటీ కమిటి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రైవేటు ఆసుపత్రుల రిజిస్ట్రేషన్లపై చర్చించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రైవేటు ఆసుపత్రులకు నిబంధనల మేరకు అనుమతులు ఇవ్వాలని సూచించారు. అన్ని నిర్ధారించుకున్న తరువాతనే రిజిస్ట్రేషన్‌కు అనుమతి ఇవ్వాలన్నారు. ప్రైవేటు ఆసుపత్రుల నిర్వాహకులు అన్ని రకాల పన్నులను సకాలంలో చెల్లించాలని ఆదేశించారు. పెండింగ్‌లో పెడితే కఠిన చర్యలు తీసుకోవాని అధికా రులను ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత, మాస్ మీడియా అధికారి రంగారెడ్డి, ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ పొలాస రాంకిరణ్, కార్యదర్శి వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రజావాణి సమస్యలను పరిష్కరించాలి

ప్రజావాణి సమస్యలను పెండింగ్‌లో పెట్టకుండా పరిష్కరించాలని కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆమె వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణికి 312 దరఖాస్తులు వచ్చాయన్నారు. అందులో కరీంనగర్ మున్సిపాలిటీ 47, డీపీవో 27, పోలీస్ కమిషనర్ 11, కరీంనగర్ ఆర్డీవో 14, కరీంనగర్ రూరల్ తహసీల్దార్ 24, గంగాధర 10, తిమ్మాపూర్ 10, మానకొండూర్ 10, వారధి సొసైటీ 13, ఇతర శాఖలకు సంబంధించిన 173దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు.

ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాల విడుదల

- ఫస్టియర్‌లో 62.71, సెకండియర్‌లో 35.05 శాతం ఉత్తీర్ణత

కరీంనగర్ టౌన్, జూన్ 24: ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదలయ్యాయి. సోమవారం బోర్డు ఆఫ్ ఇంటర్మీడియట్ విడుదల చేసిన ఫలితాల్లో ఫస్టియర్‌లో 62.71 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. 9,443 మంది పరీక్షలు రాయగా 5922 మంది పాస్ అయ్యారు. వీరిలో 5,255 మంది బాలురు పరీక్ష రాయగా 2,893 మంది పాస్ అయ్యారు. 55.05 ఉత్తీర్ణతశాతం నమోదైంది. 4,188 మంది బాలికలు పరీక్షలకు హాజరుకాగా 3,029 మంది ఉత్తీర్ణులయ్యారు.

72.33 శాతం పాస్ పర్సంటేజీ నమోదైంది. వొకేషనల్ విభాగంలో 438 మంది బాలురు పరీక్ష రాయగా 155 మంది పాస్ కావడంతో 35.39 ఉత్తీర్ణత శాతం నమోదైంది. 209 మంది బాలికలు పరీక్షలకు హాజరుకాగా 149 మంది పాస్ అయ్యారు. 71.29 శాతం ఉత్తీర్ణత సాధించి బాలికలు పై చేయిగా నిలిచారు. సెకంఢియర్‌లో 4,282 మంది పరీక్షలకు హాజరుకాగా 1501 మంది పాస్ కావడంతో 35.05 ఉత్తీర్ణత శాతం నమోదైంది. 2,687 మంది బాలురు పరీక్షలు రాయగా 831 మంది పాస్ అయ్యారు. 1595 మంది బాలికలు పరీక్షలకు హాజరు కాగా 670 మంది ఉత్తీర్ణులయ్యారు. బాలురు 30.93శాతం పాస్ అయితే బాలికలు 42.01 శాతంతో ఆధిక్యం కనబరిచారు. వొకేష నల్ విభాగంలో 512 మంది బాలురు పరీక్షలు రాయగా 198 మంది ఉత్తీర్ణులయ్యారు. 154 మంది బాలికలకు 73 మంది ఉత్తీర్ణులయ్యారు.

రీకౌంటింగ్, రీ వెరిఫికేషన్‌కు 29 వరకు దరఖాస్తుకు అవకాశం

అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ జవాబు పత్రాల రీకౌంటింగ్, రీ వెరిఫికేషన్ కోసం ఈనెల 29వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని బోర్డు ఆఫ్ ఇంటర్మీడియట్ ప్రకటించింది. మంగళవారం నుంచి 29వ తేదీ వరకు ఒక్కో పేపర్ రీ కౌంటింగ్‌కు100, రీ వెరిఫికేషన్‌కు 600 రూపాయలు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని సూచించింది.

మూడు రోజుల్లో ఆరు ట్రాన్స్‌ఫార్మర్లు చోరీ



బొమ్మనపల్లిలో చోరీకి గురైన ట్రాన్స్‌ఫార్మర్

చిగురుమామిడి, జూన్ 24: మండలంలోని బొమ్మనపల్లి, ఉల్లంపల్లి గ్రామాల్లో మూడు రోజుల వ్యవధిలో ఆరు ట్రాన్స్‌పార్మర్ల నుంచి కాపర్ వైర్‌ను దొంగలించారు. నార్లు పోసుకునే సమయంలో ట్రాన్స్‌పార్మర్లు చోరీకి గురవుతుండడంతో ఆయా గ్రామాల రైతులు ఆందోళన చెందుతున్నారు. గతంలోనూ ఇదే విధంగా చోరీలు జరిగినా దొంగలను ఇప్పటి వరకు పట్టుకోలేదని రైతులు అంటున్నారు. దొంగలు రోజంతా బావుల చుట్టూ తిరుగుతూ ట్రాన్స్‌పార్మర్‌స్‌ను గమనించి రాత్రి వేళల్లో దొంగతనాలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలా దొంగతనాలు జరిగితే తాము వ్యవసాయాం చేయడం కష్టమని అంటున్నారు. పోలీసులు నిఘాను పెంచి దొంగతనాలను నివారించాలని రైతులు కోరుతున్నారు. ఈ విషయంపై ఎస్ఐ బండి రాజేశ్‌ను వివరణ కోరగా ట్రాన్స్‌పార్మర్లు దొంగతనానికి గురయ్యాయని బొమ్మనపల్లి, ఉల్లంపల్లి రైతులు తమకు ఫిర్యాదు చేశారన్నారు. దీనిపై విచారణ జరుతున్నామని, గ్రామాల్లోని సీసీ టీవీ ఫుటేజీలు పరిశిస్తున్నామని, నిందితులను త్వరగా పట్టుకుంటామన్నారు. ్యార్థులు, యువత, మైనర్‌లకు గంజాయి అలవాటు చేస్తున్నట్లు ఇటీవల జరిగిన పలు ఘటనలు వెల్లడిస్తున్నాయి. మైనర్లు ద్విచక్రవాహనాలను అతివేగంగా నడుపుతూ ప్రమాదాలబారినపడి తల్లిదండ్రులకు ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఇటీవల కరీంనగర్ ట్రాఫిక్ పోలీసులు వరుసగా తనిఖీలు నిర్వహించి మైనర్లు నడుపుతున్న వంద ద్విచక్రవా హనాలను పట్టుకున్నారు. కేసులు నమోదు చేసి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించి వదిలిపెట్టారు. పోలీసులు రాత్రివేళ గస్తీని ముమ్మరంచేయాలని నగర వాసులు కోరుతున్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవ వేదన

- జమ్మికుంటలో గైనకాలజిస్ట్ లేకపోవడంతో ఇబ్బందులు
- నాలుగు నెలలుగా ఇదే పరిస్థితి
- ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయిస్తున్న గర్భిణులు



జమ్మికుంట ప్రభుత్వ ఆసుపత్రి

జమ్మికుంట రూరల్, జూన్ 24: ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు జరుగాలని ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తున్న గైనకాలజిస్ట్ లేక పోవడంతో అవి నిరుపయోగం అవుతున్నాయి. జమ్మికుంట ప్రభుత్వ ఆసుపత్రిలో నాలుగు నెలలుగా గైనకాలజిస్ట్ వైద్యులు లేరు. ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవం చేసుకున్న మహిళలకు ఆడబిడ్డ పుడితే 13 వేలు, మగబిడ్డ పుడితే 12 వేల రూపాయలు, కిట్లు అందిస్తోంది. జమ్మికుంట ఆస్పత్రిని సకల సౌకర్యాలతో నిర్మించడంతో గర్భిణులు ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాలు చేసుకునేందుకు ఆసక్తి కనబరిచారు. గతంలో ప్రతి నెల 20 నుంచి 40వరకు ప్రసవాలు జరిగేవి. నాలుగు నెలల క్రితం వరకు హుజూరాబాద్ నుంచి డిప్యూటేషన్‌పై జమ్మికుంటకు వచ్చిన గైనకాలజిస్ట్ నందితరెడ్డి ఇక్కడ పని చేశారు. రాష్ట్ర ప్రభుత్వం డిప్యూటేషన్లు రద్దు చేయ డంతో ఆమె తిరిగి హుజూరాబాద్‌కు వెళ్లారు. అప్పటి నుంచి గైనకాలజిస్ట్ లేక పోవడంతో ఇబ్బందులు ఎదురవుతు న్నాయి. దీంతో గర్భిణులు ప్రైవేట్ ఆసుపత్రుల వైపు మొగ్గు చూపుతున్నారు. ప్రభుత్వ ఆసుపత్రికి ప్రసవాల కోసం వచ్చే వారిలో అధిక శాతం సామాన్యులే ఉంటారు. అలాంటి వారు ప్రైవేట్ ఆసుపత్రులు వేస్తున్న బిల్లులు చూసి బెంబేలెత్తి పోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి గైనకాలజిస్ట్‌ను నియమించాలని ప్రజలు కోరుతున్నారు.



ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సిబ్బంది

నేటి నుంచి ఏఐఎస్ఎఫ్ శిక్షణ తరగతులు

భగత్‌నగర్, జూన్ 24: జిల్లా కేంద్రంలో ఈనెల 25 నుంచి 27 వరకు నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి విద్యా, వైజ్ఞానిక, రాజకీయ శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కామారపు వెంకటేష్, మచ్చ రమేశ్ పిలుపునిచ్చారు.

సోమవారం నగరంలోని పార్టీ కార్యాయంలో వారు మాట్లాడుతూ పెద్దపల్లి బైపాస్ రోడ్డులో గల ట్రినిటీ ఇంజనీరింగ్ కళాశాల సెమినార్ హాల్‌లో శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నా మని తెలిపారు. కేంద్రలోని బీజేపీ ప్రభుత్వం విద్య కార్పొరేటీకరణ, కాషాయీకరణ చేయడానికి నూతన విద్యా విధానం తీసుకొచ్చారని ఆరోపించారు. తెలంగాణ విభజన హామీల్లో తెలంగాణకు రావలసిన నవోదయ, కేంద్రీయ విద్యాలయాలు, ఐఐటీ, ఐఎం లాంటి విద్యా సంస్థలను తెలంగాణకు కేటాయించకుండా మోదీ ప్రభుత్వం కక్ష పూరితంగా వ్యవహరిస్తుందన్నారు. నీట్ పరీక్ష పేపర్ లీక్‌కు బాధ్యత వహిస్తూ నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఛైర్మెన్ ప్రదీప్ కుమార్ జోషి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలు సమస్యలతో సతమతమవుతున్నాయని అన్నారు. ప్రభుత్వ విద్యా సంస్థల్లో కనీస సదుపాయాలు కల్పించాని డిమాండ్ చేశారు.

బాసర గోదావరిలో చొప్పదండి ఎమ్మెల్యే సతీమణికి పిండప్రదానం


అంతిమసంస్కార కార్యక్రమాలను నిర్వహిస్తున్న చొప్పదండి ఎమ్మెల్యే సత్యం, పిల్లలు

బాసర, జూన్, 24: కరీంనగర్ జిల్లా చొప్పదండి ఎమ్మెల్యే సత్యం సతీమణి రూప అస్థికలను సోమవారం నిర్మల్ జిల్లా బాసర వద్ద గోదావరి నదిలో కలిపారు. ఇటీవల చొప్పదండి ఎమ్మెల్యే సత్యం భార్య రూప ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. ఎమ్మెల్యే సత్యంతో పాటు కుటుంబ సభ్యులు అంతిమ సంస్కార కార్య క్రమాలను నిర్వహించారు. పిండ ప్రదానం, అస్థికలను ఎమ్మెల్యే సత్యం నదిలో కలిపారు.

డెయిరీ ఫామ్ యజమాని ఆత్మహత్య

బర్కత్‌పుర, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): డెయిరీ ఫామ్ యజమాని డి. వంశీ కృష్ణారెడ్డి ఓ హోటల్‌లో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన కాచిగూడ పీఎస్ పరిధిలో జరిగింది. అడ్మిన్ ఎస్ఐ కె. సుభాష్ తెలిపిన వివరాల ప్రకారం. కరీంనగర్ జిల్లా రేకుర్తి మండలం సాలెహ్‌నగర్‌కు చెందిన మల్లారెడ్డి కుమారుడు డి. వంశీ కృష్ణారెడ్డి (27) బాలాపూర్‌లో డెయిరీ ఫామ్ నిర్వహిస్తున్నాడు. కాచిగూడలోని ఓ హోటల్‌లో ఆదివారం ఉదయం 203 గదిని అద్దెకు తీసుకున్నాడు. సోమవారం ఉదయం రూమ్ ఖాళీ చేస్తానని చెప్పడంతో హోటల్ సిబ్బంది వంశీ కృష్ణారెడ్డి ఉన్న గది తలుపు తడితే తీయలేదు. సిబ్బంది హోటల్ మేనేజర్‌కు ఈ విషయం చెప్పారు. కాచిగూడ పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు గది తలుపులు పగులగొట్టి చూడగా వంశీ కృష్ణారెడ్డి చనిపోయి ఉన్నాడు. పక్కన పురుగుల మందు డబ్బా ఉంది. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఉస్మానియా మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు అడ్మిన్ ఎస్ఐ కె. సుభాష్ తెలిపారు. ఆత్మహత్యకు కారణాలు తెలియవని తెలిపారు.

ఇంటర్ ఇంప్రూవ్‌మెంట్‌లో అల్ఫోర్స్ విద్యార్థుల ప్రతిభ



అంజనను అభినందిస్తున్న అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి

కరీంనగర్ టౌన్, జూన్ 24: ఇంటర్మీడియట్ ఇంప్రూవ్‌మెంట్ ఫలితాల్లో అల్ఫోర్స్ విద్యార్థులు అద్భుత మార్కులతో ప్రతిభ చాటారు. బైపీసీ విభాగంలో జె.అంజన 439/440 మార్కులతో స్టేట్ ఫస్ట్ ర్యాంకులో నిలిచింది. ఎంపీసీ విభాగంలో 30 మంది విద్యార్థులు 470 మార్కులకుగాను 468 మార్కులు సాధించారు. 81 మంది విద్యార్థులు 467 మార్కులు, 131 మంది విద్యార్థులు 466 మార్కులు సాధించారు. బైపీసీ విభాగంలో స్టేట్ ఫస్ట్ మార్కులతో పాటు నలుగురు విద్యార్థులు 438 మార్కులు, 14 మంది 437 మార్కులు, 34 మంది 436 మార్కులు సాధించారు. ఎంఈసీలో టి.అఖిల్, వి.రిషిత, ఎం.శ్రీవల్లి పటేల్ 500 మార్కులకు 494 మార్కులు సాధించి రాష్ట్రంలోనే అత్యున్నత స్థానం పొందారు. సీఈసీ విభాగంలో బి.గ్రీష్మ, సిహెచ్. నిఖిత 500 మార్కులకు 494 మార్కులు సాధించారు. అన్ని విభాగాలలో అత్యద్భుత ఫలితాలు సాధించడంలో అల్ఫోర్స్‌కు మాత్రమే సాధ్యమైందని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. పటిష్ఠ ప్రణాళికతో విద్యా బోధన, నిరంతర పర్యవేక్షణ, విద్యార్థుల కృషితో ఇంతటి ఘనవిజయం సాధ్యమైందన్నారు. అద్భుత ఫలితాలు సాధించిన విద్యార్థులను నరేందర్‌రెడ్డి అభినందించారు.

నైపర్‌లో శాతవాహన ఫార్మసీ విద్యార్థులకు ర్యాంకులు



జి. నందిని



వై. స్నేహ



ఎం,సాయికిరణ్

గణేశ్‌నగర్,జూన్ 24: శాతవాహన విశ్వవిద్యాలయం ఎల్ఎండీ క్యాంపస్ ఫార్మసీ కళాశాల విద్యార్థులు ప్రతిష్ఠాత్మక జాతీయ ఫార్మసీ విద్యా, పరిశోధన సంస్థ (నైపర్) ప్రవేశపరీక్షలో ర్యాంకులు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కే శ్రీశైలం తెలిపారు. ఈ పరీక్షలో జి.నందిని 296, వై.స్నేహ 429, యం.సాయికిరణ్ 1633, జి.ప్రత్యూష 1819, ఏ.లోకేశ్ 2244, బి.పల్లవి 2,327, ఏ.రమ్య 2,661, పి సాయిపూజిత 2931, యం భానుమతి 3324, ఎస్ జగదీష్3940, జి ప్రగతి 5228 ర్యాంకులు సాధించి ఎంఫార్మసీలో ప్రవేశానికి అర్హత సాధించారని తెలిపారు. ఈ విద్యార్థులకు అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్య లభిస్తుందని, అంతర్జాతీయంగా పేరుగాంచిన శాస్త్రవేత్తలతో కలిసి పనిచేసే అవకాశం లభిస్తుందని తెలిపారు. ప్రతి విద్యార్థికి రెండు సంవత్సరాల ఎం ఫార్మసీ కోర్సు వ్యవధి కాలంలో ప్రతినెలా 12,400 రూపాయల ఉపకార వేతనం లభిస్తుందని అన్నారు. ప్రవేశానికి అర్హతపొందిన విద్యార్థులను విశ్వవిద్యాలయ ఇంచార్జ్ ఉపకులపతి సురేంద్రమోహన్ ఐఏఎస్, రిజిస్ట్రార్ ఆచార్య యం వరప్రసాద్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ వై.కిషోర్, అధ్యాపకులు అభినందించారు.

డిగ్రీ సెమిస్టర్ పరీక్షల్లో 16 మంది విద్యార్థుల డీబార్

గణేశ్‌నగర్, జూన్ 24: శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో జరుగుతున్న డిగ్రీ రెండో, నాల్గవ సెమిస్టర్ పరీక్షల్లో సోమవారం 16 మంది విద్యార్థులు మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడగా డీబార్ చేసినట్లు శాతవాహన విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధి కారి డాక్టర్ ఎన్వి శ్రీరంగప్రసాద్ తెలిపారు. శ్రీ చైతన్య డిగ్రీ కళాశాల, ధర్మపురిలో ఆరు గురు, శివాని డిగ్రీ కళాశాల సుల్తానాబాద్‌లో ఒకరు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మంథని లో ఒకరు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల జమ్మికుంటలో ఐదుగురు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, హుస్నాబాద్‌లో ఒకరు, శ్రీ చైతన్య డిగ్రీ కళాశాల కరీంనగర్‌లో ఒకరు, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల జగిత్యాలలో ఒకరు. మొత్తం 16 మంది విద్యార్థులు డీబార్ అయినట్లు తెలిపారు.

ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య

తంగళ్లపల్లి, జూన్ 24: ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాల్లో ఫెయిలవడంతో ఇంజినీరింగ్ చేయాలనే తన కల నెరవేరదని మనస్తాపం చెంది తోకల సాక్షి(18) అనే విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లికి చెందిన తోకల సాక్షి(18) మండలంలోని మండెపల్లి మోడల్ స్కూల్‌లో ఇటీవల ఇంటర్మీడియెట్ చదివింది. వార్షిక ఫలితాల్లో మ్యాథ్స్ సబ్జెక్ట్‌లో ఫెయిల్ అయ్యింది. అనంతరం అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీతోపాటు ఎంసెట్ రాసింది. ఈ క్రమంలో ముందుగా ఎంసెట్ ఫలితాలు రాగా అందులో అర్హత సాధించింది. సోమవారం విడుదలైన ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాల్లో ఫెయిల్ అయ్యింది. దీంతో ఇంజనీరింగ్ చేయాలనే తన కల నెరవేరడం లేదని మనస్తాపానికి గురైంది. ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఉరి వేసుకుని యువతి ఆత్మహత్య

ఫైటింక్లయిన్‌కాలనీ, జూన్ 24: గోదావరిఖని టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సంతోష్‌నగర్‌లో సోమవారం బానోతు అక్షయ(19) ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి బంధువుల కథనం ప్రకారం.. కరీంనగర్‌లో నర్సింగ్ రెండో సంవత్సరం చదువుతున్న అక్షయ పరీక్షల అనంతరం ఇంటికి వచ్చింది. కాలేజీ ప్రారంభం అవుతున్నదున మూడో సంవత్సరానికి సంబంధించిన ఫీజు విషయమై తండ్రిని అడిగింది. ప్రస్తుతానికి డబ్బులు లేవని, జీతం వచ్చాక ఫీజు డబ్బులు ఇస్తానని తండ్రి రాజేషం చెప్పడంతో మనస్తాపంతో గదిలోకి వెళ్లి తలుపులు వేసుకుంది. అక్షయ చిన్నచిన్న విషయాలకు అలుగుతూ గదిలో తలుపువేసుకుని కొంత సేపటి తర్వాత వచ్చేదని, కానీ సోమవారం సాయంత్రానికి గాని తలుపులు తీయకపోవడంతో తండ్రి రాజేషం తలుపులు పగుల గొట్టి చూడగా చీరతో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని కనిపించింది. మృతురాలి సోదరి అనీల ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఏటీఎంలో చోరీకి విఫలయత్నం



వేలిముద్రలను సేకరిస్తున్న క్లూస్ టీం

ఎల్లారెడ్డిపేట, జూన్ 24: ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లిలోని యాక్సిస్ బ్యాంకు ఏటీఎంలో ఆదివారం రాత్రి దొంగ చోరీకి యత్నించినట్లు పోలీసులు తెలిపారు. ఏటీఎం దొంగత నానికి వచ్చిన వ్యక్తి మిషన్ నుంచి డబ్బులు దొంగిలించేందుకు యత్నించాడు. ఫలితం లేకపోవడంతో వెళ్లిపోయాడు. ఆన్‌లైన్ ద్వారా విషయం తెలుసుకున్న బ్యాంకు అధికారులు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంటనే ఘటన స్థలాన్ని పరిశీలించారు. సోమవారం ఉదయం ప్రత్యేక పోలీసులు వేలిముద్రలను సేకరించారు. సీసీ కెమెరాలో నిక్షిప్తమైన వీడియోను విడుదల చేశారు. చోరీకి విఫలయత్నం చేసిన వ్యక్తిని గుర్తిస్తే 87126 56374, 8712656373, 9000457637 నంబర్లకు సమాచారం అందించాలని కోరారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రెండు గంటలు ఉత్కంఠ

● ఎమ్మెల్సీతో మంత్రి శ్రీధర్‌బాబు మంతనాలు ● కార్యకర్తల నినాదాలతో మారుమోగిన నివాసం
● క్యాడర్, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి మనోవేదన అధిష్టానానికి తెలియజేస్తానన్న మంత్రి



జగిత్యాలలో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డితో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్ బాబు, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, నాయకులు

జగిత్యాల, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని జగిత్యాలలో గల ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి నివాసంలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సుమారు రెండు గంటల పాటు గడిపారు. జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్‌ను కాంగ్రెస్ పార్టీలోకి చేర్చుకోవడంపై కినుక వహించారన్న సమాచారం మేరకు సోమవారం రాత్రి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు జగిత్యాలకు వచ్చారు. శ్రీధర్‌బాబు కాన్వాయ్ రావడంతోనే అక్కడ పెద్ద ఎత్తున గుమిగూడిన కాంగ్రెస్ కార్యకర్తలు, జీవన్‌రెడ్డి అభిమానులు జోరున నినాదాలు చేశారు. జీవన్‌రెడ్డి జిందాబాద్, జీవనన్నకు జై జై అంటూ నినదించారు. కార్యకర్తలకు నమస్కరిస్తూ మంత్రి శ్రీధర్ బాబు ఇందిరాభవన్‌లోని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి నివాసానికి వెళ్లారు. గదికి గడియ వేసుకొని సుదీర్ఘ సమయం పాటు చర్చించారు. ముందుగా ప్రభుత్వ విప్‌లు అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఆది శ్రీనివాస్‌లతో ముచ్చటించి పలు వివరాలను అడిగి తెలుసుకున్నారు. పెద్దపల్లి ఎమ్మెల్యే విజయ రమణారావుతో కొద్దిసేపు మాట్లాడారు. అనంతరం ఎమ్మెల్సీ జీవన్ రెడ్డితో అభిప్రాయాలను, మనో వేదనను పంచుకున్నారు.

ఎమ్మెల్సీ నివాసంలో మంత్రి శ్రీధర్ బాబు ముచ్చటిస్తున్న సమయంలో ఆరుబయట వాకిలిలో, రహదారిపై, ప్రహరీ గోడలపై ఉన్న కార్యకర్తలు, అభిమానులు జీవన్‌రెడ్డికి మద్దతుగా నినదించారు. లోపల ఏమి జరుగుతుందో తెలియక క్యాడర్ అయోమయానికి గురైంది. ఎటువంటి నిర్ణయం తీసుకుంటారో...ఏమి జరగనుందోనన్న ఆసక్తితో అభిమానులు, కార్యకర్తలు అక్కడే నిలబడి ఆసక్తిగా ఎదురుచూశారు. ఎట్టకేలకు సుమారు రెండు గంటల తరువాత మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కార్యకర్తలకు నమస్క రించి అభిప్రాయాన్ని వెల్లడించారు. నిన్నటి రోజున జరిగిన సంఘటనతో ఎమ్మెల్సీ మనస్తాపానికి గురయ్యారన్న సమాచారం తెలుసుకొని మర్యాద పూర్వకంగా కలవడానికి జగిత్యాలకు వచ్చానని ప్రకటించారు. సుదీర్ఘంగా జీవన్ రెడ్డితో మాట్లాడి ఆయన మనోవేదనను, అభిప్రాయాలను తెలుసుకున్నానని స్పష్టం చేశారు. ఇక్కడ చోటుచేసుకున్న పరిస్థితి, క్యాడర్ అభిప్రాయాలు, జీవన్ రెడ్డి మనోవేదనను ఏఐసీసీ, పీసీసీ అగ్రనేతలతో పాటు సీఎం రేవంత్‌రెడ్డికి వివరిస్తానన్నారు. ఇప్పటివరకు కాంగ్రెస్‌కు జీవన్‌రెడ్డి పెద్ద దిక్కుగా ఉన్నారని, రాబోయే కాలంలో సైతం కాంగ్రెస్‌కు పెద్ద దిక్కుగా వ్యవహరిస్తారని ప్రకటించారు. క్యాడర్ అధైర్య పడొద్దని కోరారు. జీవన్‌రెడ్డి నివాసానికి అధిక సంఖ్యలో జనం రాకుండా పోలీసులు బందోబస్తు నిర్వ హించారు. జీవన్‌రెడ్డి నివాసానికి వచ్చే రహదారులను బారీగేట్లతో మూసి వేశారు. వాహనాల రాకపోకలను నియంత్రించారు.

తాళం వేసి ఉన్న ఇళ్లలో చోరీ

కోరుట్ల మండలం గుమ్లాపూర్‌లో 7 తులాల బంగారం, లక్ష నగదు
జమ్మికుంట మండలం కొత్తపల్లిలో లక్ష నగదు, బంగారం అపహరణ



కోరుట్ల మండలం గుమ్లాపూర్‌లో క్లూస్ టీం తనిఖీలు

కోరుట్ల రూరల్, జూన్ 24 : మండలంలోని గుమ్లాపూర్ గ్రామంలో తాళం వేసి ఉన్న ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు భారీ చోరీకి పాల్పడ్డారు. పోలీసులు..బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన ఆర్ఎంపీ తెడ్డు రమేష్ కుటుంబ సభ్యులతో కలిసి ఇంటికి తాళం వేసి బంధువుల ఇంటికి ఆదివారం రాత్రి వెళ్లాడు. సోమవారం ఉదయం ఇంటి పక్కనే ఉన్న వారు తలుపు తీసి ఉన్న విషయాన్ని గుర్తించి రమేష్ కు సమాచారం అందించారు. హుటాహుటిన రమేష్ ఇంటికి చేరుకుని చూడగా ప్రధాన ద్వారానికి వేసిన తాళం పగులగొట్టి ఉండటంతో పాటు ఇంటిలోని సామగ్రి చిందర వందరగా పడిఉన్నాయి. బెడ్ రూంలో ఉన్న బీరువాలోని వస్తువులు తీసి బయట పడేసి ఉండడంతో చోరీ జరిగినట్లు గుర్తించారు. వెంటనే కోరుట్ల పోలీసులకు సమాచారం అందించడంతో సీఐ సురేష్ బాబు తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. రమేష్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. బీరువాలో ఉన్న 7 తులాల బంగారు ఆభరణాలు, లక్ష నగదు చోరీకి గురైనట్లు బాధితుడు రమేష్ ఫిర్యాదు పేర్కొన్నాడు.



జమ్మికుంట మండలం కొత్తపల్లిలో చిందర వందరగా పడేసి ఉన్న సామగ్రి

జమ్మికుంట మున్సిపల్ పరిధి కొత్తపల్లిలో..

జమ్మికుంట: జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని కొత్తపల్లిలో తాళం వేసి ఉన్న ఇంట్లో దొంగతనం జరిగింది. పోలీస్‌లు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తపల్లికి చెందిన శ్రీపతి రమేష్ ఈ నెల 22న ఓదెల మండలం గుంపులలో ఓ శుభకార్యానికి కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లారు. 24న ఉదయం 6.30కు ఇంటికి వచ్చిన రమేష్‌కు మెయిన్ గేట్ తాళం పగులగొట్టి ఉండడాన్ని చూసి ఆందోళనకు గురయ్యాడు. తలుపులు తెరిచి ఉండగా లోనికి వెళ్లాడు. బీరువా తలుపులు తెరుచుకొని ఉన్నాయి. అందులో ఉన్న లక్ష నగదు, 23 వేల రూపాయల విలువ గల బంగారు, వెండి ఆభరణాలు చోరీకి గురైనట్లు గుర్తించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ వరంగంటి రవి తెలిపారు.

ప్రేమ జంట ఆత్మహత్యాయత్నం

చికిత్స పొందుతూ యువకుడి మృతి



చందు(ఫైల్)

కరీంనగర్ క్రైం/ముస్తాబాద్, జూన్ 24: పెద్దలు ఒప్పుకోరనే భయంతో ఓ ప్రేమజంట పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నం చేసింది. వారిలో యువకుడు మృతి చెందగా యువతి చికిత్స పొందుతోంది. కరీంనగర్ వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం గూడెం గ్రామానికి చెందిన పెంటం చందు(23), అదే గ్రామానికి చెందిన ఓ యువతి కొంత కాలంగా ప్రేమించుకుంటున్నారు. ఆ యువతి కరీంనగర్‌లోని ఒక ప్రైవేట్ హాస్టల్‌లో ఉంటూ డిగ్రీన చదువుతోంది. చందు ఆదివారం గూడెం నుంచి యువతిని కలిసేందుకు కరీంనగర్‌కు వచ్చాడు. మధ్యాహ్నం చందు ఫోన్ నుంచి అతడి సోదరుడు నవీన్‌కుమార్‌కు యువతి ఫోన్ చేసి చందు, తాను ప్రేమించుకున్నామని, పెద్దలు ఒప్పుకోరనే భయంతో చనిపోదామని ఇద్దరం నిర్ణయించుకుని కరీంనగర్ ఉజ్వలపార్కు వద్ద పురుగుల మందుతాగామని తెలిపింది. ఒక వ్యక్తి సహాయంతో ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చామని చెప్పి ఫోన్ పెట్టేసింది. దీంతో నవీన్‌కుమార్ వెంటనే తన బావతో కలిసి కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి రాగా చందు చికిత్సకు సహకరించడంలేదని వైద్యులు తెలిపారు. వారు ఇద్దరినీ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. చందు చికిత్స పొందుతూ సోమవారం మధ్యాహ్నం మృతి చెందాడు. యువతిని వారి తల్లి దండ్రులు ఎల్లారెడ్డిపేట ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

పాన్ షాప్‌లలో పోలీసుల తనిఖీలు

సిరిసిల్ల క్రైం, జూన్ 24: సిరిసిల్ల పట్టణంలోని పలు పాన్‌షాపులు, కిరాణా దుకాణాల్లో సోమవారం పోలీస్ జాగిలాలతో విస్తృత తనిఖీలు నిర్వహించారు. నిషేధిత గంజాయి, ఇతర మత్తుపదార్థాలు విక్రయిస్తున్నారనే సమాచారంపై పోలీసులు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా టౌన్ సీఐ రఘుపతి మాట్లాడుతూ గంజాయి, ఇతర మత్తు పదార్థాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవన్నా రు. మత్తు పదార్థాల నిర్మూలనే లక్ష్యంగా పోలీస్ శాఖ పని చేస్తోంద న్నారు. ఎవరికైనా సమాచారం తెలిస్తే పోలీస్‌స్టేషన్‌లోగానీ డయల్ 100కుగానీ సమాచారం అందించాలని సూచించారు.



పాన్‌షాప్‌లలో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

పశువుల అంగడిలో వసూళ్ల దందా

జమ్మికుంట, జూన్ 24: జమ్మికుంట మున్సిపాల్టీ పరిధిలో ప్రతి మంగళవారం నిర్వహించే పశువుల అంగడిలో గుత్తేదారు అడ్డగోలు వసూళ్లకు తెరలేపారు. మున్సి పాల్టీకి ప్రతి ఏటా సుమారు 40 లక్షల రూపాయల మేరా ఆదాయం సమకూర్చే అం గడిని అధికారులు గాలికి వదిలేశారు. దీంతో గుత్తేదారు ఆడిందే ఆట పాడిందే పాట గా మారిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రతి ఏటా బహిరంగ వేలం ద్వారా గుత్తే దారులు అంగడిని దక్కించుకుంటారు. ఏప్రిల్ నుంచి మార్చి వరకు అంగడి దక్కిం చుకున్న గుత్తేదారు పశువులు, మేకలు, గొర్రెలు ఇతర క్రయ విక్రయాలపై ఫీజు వసూలు చేసుకుంటారు. పశువులను వెయ్యి వరకు 30 రూపాయల చొప్పున, ఆపై విక్రయాలకు ఆరు వందల రూపాయలకు మించకుండా వసూలు చేయాలి. గొర్రెలు, మేకలకు వందకు ఐదు రూపాయల చొప్పున వసూలు చేస్తారు. గుత్తేదారు పశువుల విలువలో పది శాతం మేరడబ్బులు వసూళ్లు చేస్తుండటంతో క్రయ, విక్రయదారులు లబోదిబో మంటున్నారు. నిబంధనల ప్రకారం వసూళ్లు జరిగేలా చూడాల్సిన అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదు.

● రశీదు బుక్కులు వెనక్కి ఇవ్వని గుత్తేదారు

అంగడి దక్కించుకున్న గుత్తేదారుడికి మున్సిపాల్టీ అధికారులు స్టాంప్ వేసిన రశీదు బుక్కులు జారీ చేస్తారు. ప్రతి వారం రశీద్ బుక్కుల ద్వారా ఫీజు వసూలు చేయాల్సి ఉంటుంది. రశీదు బుక్ పూర్తి అయిన వెంటనే తిరిగి మున్సిపాల్టీకి అప్పగించాలి. ఇప్పటి వరకు పూర్తి అయిన రశీదు బుక్కులు తిరిగి వెనక్కి ఇవ్వలేదు. రశీదు బుక్కుల్లో కార్బన్ పెట్టకుండా అధికంగా డబ్బులు వసూలు చేయడం పరిపాటిగా మారింది. ఉన్నతాధికారులు స్పందించి అంగడిలో వసూళ్లపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని పట్టణవాసులు కోరుతున్నారు.

తాట్లవాయి అడవిలో వృద్ధురాలి మృతదేహం

● పెన్షన్ కోసం వెళ్లి మృత్యువాత
● అనుమానాస్పద మృతిగా కేసు నమోదు

రాయికల్, జూన్ 24: రాయికల్ మండలం కట్కాపూర్ గ్రామానికి చెందిన ఆవుల పోచమ్మ(60) అనే వృద్ధురాలు సోమవారం అడవిలో శవమై కనిపించింది. తాట్ల వాయి, కైరిగూడెం గ్రామాల మధ్య ఉన్న అడవిలో ఈ వృద్ధురాలి మృతదేహాన్ని స్థానికులు కనుగొన్నారు. స్థానికులు, ఏఎస్సై దేవేందర్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన పోచమ్మ ఇంట్లో ఒంటరిగా ఉంటుందని, ఒక్క కూతురు, ఇరువురు కుమారులు ఉండగా, ఈ నెల 19న పెన్షన్ డబ్బులు తీసుకొని వస్తానని చెప్పి వెళ్లి ఇంటికి తిరిగి రాలేదని ఏఎస్సై చెప్పారు. అప్పటి నుంచి ఆమె ఆచూకీ కోసం బంధువులు వెతుకున్నారు. అయితే సోమవారం తాట్లవాయి గ్రామస్థులకు అనుమానాస్పద స్థితిలో కుళ్లిపోయిన మృతదేహం తమ గ్రామ శివారులోని అడవిలో చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ మృతదేహం కుళ్లి పోయి దుర్వాసన వస్తుండటంతో అక్కడే పోస్టుమార్టం నిర్వహించిన పోలీసులు ఈ శవం పోచమ్మదేనని ఆమె కూతురు గుర్తించిందని ఏఎస్సై తెలిపారు. దీంతో అనుమానస్పద మృతిగా కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు వివరిం చారు. పెన్షన్ డబ్బుల కోసం వెళ్లిన వృద్ధురాలు అడవిలో మృతి చెంది ఉండటంతో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రమాదవశాత్తు జారి పడటం వల్ల కానీ, మరే ఇతర కారణాల వల్ల చనిపోయి ఉండవచ్చని మృతురాలు కూతురు లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానస్పద మృతిగా కేసు నమోదు చేశామని తెలిపారు. సంఘటనా స్థలాన్ని జగిత్యాల రూరల్ సీఐ కృష్ణారెడ్డి పరిశీలించారు.

రోడ్డు ప్రమాదంలో యూపీ కార్మికుడి దుర్మరణం

కరీంనగర్ క్రైం, జూన్ 24: కరీంనగర్ మానేరు బైపాస్ రోడ్‌లో డీర్‌పార్క్ వద్ద సోమవారం ఉదయం 2.20 గంటలకు జరిగిన రోడ్డు ప్రమాదంలో ఉత్తరప్రదేశ్‌కు చెందిన కార్మికుడు సోను అలియాస్ సోను హసన్(26) మృతి చెందాడని కరీంనగర్ ఒకటో ఠాణా పోలీసులు తెలిపారు. సోను అతని బంధువులు కలిసి హనుమాన్‌నగర్‌లో నివాసం ఉంటూ స్థానికంగా కార్మికులుగా పనిచేస్తున్నారని, సోను ఆదివారం రాత్రి బైక్‌పై అర్జున్, రాజు, శ్యాంకుమార్‌లను వెనుక కూర్చుండబెట్టుకుని డ్యాంకట్ట పైకి వెళ్లి అక్కడే భోజనం చేసి తిరిగి బైక్‌పై హనుమాన్ నగర్‌కు వస్తుండగా అతివేగంగా వీధి దీపాల స్తంభానికి బైక్‌ను ఢీకొట్టినట్లు పోలీసులు తెలిపారు. ప్రమాదంలో తీవ్రగాయాలతో సోను అక్కడికక్కడే మృతి చెందగా గాయాలైన అర్జున్, రాజు, శ్యాంకుమార్‌లను 108 అంబులెన్స్‌లో కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. మృతుడి బంధువుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టిన ఆర్టీసీ బస్సు

వ్యక్తి పరిస్థితి విషమం

ఎండపల్లి, జూన్ 24: జగిత్యాల జిల్లాలోని ముంజంపల్లి గ్రామంలో ఓ ఆర్టీసీ బస్సు బైక్‌ని సోమవారం రాత్రి ఢీ కొట్టడంతో ద్విచక్ర వాహనంపై ఉన్న వ్యక్తి కాలు నుజ్జు నుజ్జు అయింది. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. ముంజంపల్లి గ్రామానికి చెందిన సట్ట రాజయ్య అటవీశాఖలో వాచర్‌గా పని చేస్తున్నాడు. పని పూర్తి చేసుకుని కుక్కలగూడూర్ వైపు నుంచి ముంజంపల్లి గ్రామానికి ద్విచక్ర వాహనంపై వస్తున్నాడు. ఈ క్రమంలో ధర్మారం నుంచి గోదావరిఖని వెళ్తున్న ఆర్టీసీ బస్సు డ్రైవర్‌కు చెట్ల కొమ్మలు బస్సుకు అడ్డు రావడంతో స్టీరింగ్‌ను తిప్పడంతో అదుపు తప్పి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో రాజయ్య కాలు నుజ్జు నుజ్జు అయి తీవ్ర రక్తస్రావం అయింది. చేతికి కూడా తీవ్ర గాయమైంది. సంఘటనా స్థలంలో ఉన్న వారు వెంటనే రాజయ్యను పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆయన పరిస్థితి విషమంగానే ఉంది.

పురుగుల మందు తాగి వివాహిత ఆత్మహత్య

సుల్తానాబాద్, జూన్ 24: సుల్తానాబాద్ మున్సిపల్ విలీన గ్రామమైన పూసాలకు చెందిన దాసరి రమ (33) అనే వివాహిత ఆత్మహత్యాయత్నం చేయగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. ఎస్ఐ శ్రావణ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పూసాల గ్రామానికి చెందిన దాసరి రమను 15 ఏళ్ల క్రితం గొల్లపల్లి గ్రామానికి చెందిన దాసరి శ్రీశైలంకు ఇచ్చి వివాహం జరిపించారు. తగిన కట్న కానుకలతో పాటు ఉపాధి కోసం ఆటో ఇచ్చారు. కొంతకాలం కాపురం అనంతరం మరో ఐదు లక్షల రూపాయలను ఆదనంగా కట్నం కింద తేవాలంటూ రమను వేధింపులకు గురి చేశాడు. దీంతో రమ పుట్టింటికి వెళ్లగా పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీ పెట్టి నచ్చచెప్పారు. అయినా భర్త శ్రీశైలం, అత్త దాసరి కొమురమ్మ, తోటి కోడలు లక్ష్మి కలిసి రమను అనేక మాటలతో వేధించారన్నారు. దీంతో మనస్తాపం చెందిన రమ ఆదివారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. గమనించిన కుటుంబ సభ్యులు సుల్తానాబాద్ ప్రభుత్వ అసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతు రమ సోమవారం మృతి చెందింది. రమకు కూతురు, కొడుకు ఉన్నారు. మృతురాలి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రావణ్ కుమార్ తెలిపారు.


ధూళికట్టలో వ్యక్తి అదృశ్యం



తిరుపతియాదవ్ (ఫైల్)

ఎలిగేడు, జూన్ 24: మండలం లోని ధూళికట్ట గ్రామానికి చెందిన కొండ తిరుపతియాదవ్ (40) ఈ నెల 22న ఉదయం నుంచి కనిపిం చడం లేదని జూలపల్లి ఎస్సై శ్రీధర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. తిరుపతి యాదవ్ ఇంట్లో ఎవరికీ చెప్పకుండా సెల్‌ఫోన్ సైతం ఇంట్లోనే పెట్టి వెళ్లాడన్నారు. సాయంత్రం వరకు చూసినా ఇంటికి తిరిగి రాకపోవడంతో అతని బంధువులు, కుటుంబసభ్యులు ఆచూకీ కోసం వెతికినా లభ్యం కాలేదన్నారు. సుమారు 5.6అడుగుల ఎత్తు ఉండి తెలుపు రంగులో ఉన్నాడని తెలిపారు. తిరుపతి ఇంట్లో నుంచి వెళ్లినప్పుడు తెలుపు రంగు షర్ట్, బ్లూ కలర్ ప్యాంటు ధరించి ఉన్నాడని వివరించారు. తిరుపతికి వరుసకు అన్న అయిన కొండ కొమురయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



గంగారాం (ఫైల్)

కోరుట్ల రూరల్, జూన్ 24: మండలంలోని సర్ప రాజుపూర్ గ్రామంలో సోమవారం 11 కేవి విద్యుత్‌తీగ తగిలి ఓ వృద్ధుడు సోమవారం మృతి చెందాడు. గ్రామస్థుల వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన కొక్కు నడిపి గంగారాం(60) రెండు రోజుల క్రితం కురిసిన గాలి వానతో ఇంటి ముందున్న రేకుల షేడ్ కొంత మేర ధ్వంసం అయింది. వాటిని సరి చేయడానికి సోమవారం షెడ్‌పైకి ఎక్కి రేకులను సరి చేస్తూ వాటిపై తాడిపత్రి కప్పుతున్న సమయంలో విద్యుత్ తీగలకు తగిలి షాక్ కొట్టడంతో గంగారాం షెడ్‌పైనే కుప్పకూలి గంగారం అక్కడిక్కక్కడే మృతి చెందాడు. గ్రామస్థులు ఇచ్చిన సమాచారంతో పోలీసులకు సంఘటన స్థలానికి చేరుకున్నారు. గంగారాం భార్య రాజేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వ్యక్తిపై దాడి: కేసు నమోదు

కొడిమ్యాల, జూన్ 24 : మండలంలోని తిర్మాలాపూర్ గ్రామానికి చెందిన అవునూరి విష్ణువర్ధన్‌ను గాయపర్చిన అదే గ్రామానికి చెందిన ఉల్లెందుల అంజయ్యపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎస్. సందీప్ సోమవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల మేరకు విష్ణువర్ధన్ ఆదివారం రాత్రి ఒంటరిగా వెలుతుండగా అంజయ్య కత్తితో దాడి చేయడంతో చాతికి ఎడమ చేతికి గాయాలయ్యాయి. పాత పగలను మనుస్సులో పెట్టుకొని చంపాలనే ఉద్దేశంతో దాడి చేశాడని గాయాలైన అతడిని చికిత్స కోసం ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు. బాధితుడి తండ్రి అవునూరి వెంకటేశం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

నేడు నగరంలో విద్యుత్ సరఫరా నిలిపివేత

గణేశ్‌నగర్, జూన్ 24: నగరంలో విద్యుత్ లైన్ పనుల్లో భాగంగా మంగళవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు వివిధ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్ టు, ఏడిఈ, సుధీర్ కుమార్ తెలిపారు. విద్యుత్ నిలిపివేయు ప్రాంతాలు, ఎన్టీఆర్ విగ్రహం, హనుమాన్‌నగర్ లేన్‌లోని శ్రద్ధ, ఉజ్వాల పార్క్ ప్రాంతం ఏరియా, వివిధ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

అంగారిక టౌన్‌షిప్‌లో అభివృద్ధి పనులు చేపట్టాలి



కలెక్టర్‌ను కలిసిన అంగారిక టౌన్‌షిప్ ప్లాట్ ఓనర్స్

కరీంనగర్ టౌన్, జూన్ 24: జిల్లా కలెక్టర్ పమేలా సత్పతిని అంగారిక టౌన్‌షిప్ ప్లాట్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ముస్కు రఘుశంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో సభ్యులు మర్యాద పూర్వకంగా కలిశారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లో ఆమెను కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అంగారిక టౌన్ షిప్ అభివృద్ధికి చర్యలు చేపట్టాలని ఈ సందర్భంగా కలెక్టర్‌ను వారు కోరగా, ఆమె సానుకూలంగా స్పందిస్తూ అన్నిరకాల సౌకర్యాలను కల్పించిన తర్వాతనే మిగిలిన ప్లాట్లను విక్రయించాలని నిర్ణయించినట్లు తెలిసింది.

సదరం సర్టిఫికెట్లు ఇప్పించాలి

సుభాష్‌నగర్, జూన్ 24: హుజురాబాద్‌లో నిర్వహించిన ప్రత్యేక శిబిరానికి సంబందించిన సదరం సర్టిఫికెట్లు ఇప్పించాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు జక్కం సంపత్ కోరారు. ఈ మేరకు సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హుజురాబాద్ నియోజకవర్గంలో 2021లో దివ్యాంగుల కోసం ప్రత్యేక సదరం శిబిరాన్ని ఏర్పాటు చేశారని తెలిపారు. అయితే వారి వివరాలను డీఆర్‌డీఏ, ప్రభుత్వాసుపత్రి అధికారులు ఆన్‌లైన్‌లో నమోదు చేయకపోవడంతో ఇంత వరకు వారికి సర్టిఫికెట్లు అందలేదని ఆరోపించారు. దీనిపై పలుమార్లు విన్నవించగా, ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ స్పందించి, సిబ్బంది కొరత వల్ల డాటా నమోదు చేయలేదని తెలిపారని పేర్కొన్నారు. ఇద్దరు కంప్యూటర్ ఆపరేటర్లను ఇవ్వాలని డీఆర్‌డీఏ అధికారులను లిఖిత పూర్వకంగా కోరి రెండు నెలలు అయినప్పటికీ ఇంత వరకు ఆపరేటర్లను పంపించలేదన్నారు. వెంటనే ఆపరేటర్లను పంపించి దివ్యాంగులకు సదరం సర్టిఫికెట్లు అందించాలని కోరారు.

కాపు ఐక్యవేదిక రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా చల్ల



చల్ల హరిశంకర్

కరీంనగర్ టౌన్, జూన్ 24: ఆల్ ఇండియా భారతీయ కాపు ఐక్యవేదిక రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కరీంనగర్‌కు చెందిన చల్ల హరిశంకర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బెంగుళూరులో గత నాలుగురోజులుగా జరుగుతున్న 29 రాష్ట్రాల కాపు సంఘాల అధ్యక్షులతో జరిగిన ఆల్ ఇండియా భారతీయ కాపు ఐక్యవేదిక సమావేశంలో ఈ మేరకు తెలంగాణ రాష్ట్రం నుంచి హరిశంకర్‌కు స్థానం కల్పించారు. ఈ సమావేశంలో దేశంలోని కాపులందరినీ ఒక తాటి మీదకి తీసుకువచ్చి కాపులందరూ ఆర్థికంగా, రాజకీయంగా బలపడే విధంగా కృషిచేయాలని తీర్మానించినట్లు హరిశంకర్ తెలిపారు. మున్నూరు కాపుల ఐక్యత కోసం కృషిచేస్తానని చెప్పారు. చల్ల హరిశంకర్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎన్నిక కావడం పట్ల జిల్లాకు చెందిన పలువురు మున్నూరు కాపు సంఘాల ప్రతినిధులు, సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

ఉపాధ్యాయులకు పదోన్నతులపై హర్షం

కరీంనగర్ టౌన్, జూన్ 24: తొమ్మిదేళ్లుగా నిలిచిన ఉపాధ్యాయుల పదోన్నతుల ప్రక్రియలోని అడ్డంకులను తొలగించి పదోన్నతులు కల్పించడం హర్షణీయమని ఎస్‌టియు టీఎస్ రాష్ట్ర కార్యదర్శి సాన కిషన్ అన్నారు. కోర్టు కేసులను ఎదుర్కొంటూ ఉపాధ్యాయులకు, విద్యావ్యవస్థకు న్యాయం చేకూర్చారని సీఎం రేవంత్‌రెడ్డి, ముఖ్య కార్యదర్శి బుర్ర వెంకటేశం, కమిషనర్ శ్రీదేవసేనకు ఉపాధ్యాయుల పక్షాన ఆయన కృతజ్ఞతలు తెలిపారు. నాన్ జాయినింగ్ పోస్టుల్లో మరోమారు పదోన్నతులు చేపట్టిన తర్వాతనే బదిలీలు చేపట్టాలన్నారు.

రుణమాఫీపై కాంగ్రెస్ సంబరాలు



గన్నేరువరంలో క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

గన్నేరువరం, జూన్ 24: రెండు లక్షల రుణమాఫీకి కేబినెట్ ఆమోదం తెలిపిన సందర్భంగా మండల కేంద్రంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముస్కు ఉపేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ చిత్రపటాలకు సోమవారం క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బొడ్డు సునీల్, గ్రామశాఖ అధ్యక్షుడు చింతల శ్రీధర్‌రెడ్డి, నాయకులు అనిల్, తిరుపతి, మల్లేశం, కరుణాకర్‌రెడ్డి, సంపత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● తిమ్మాపూర్: మండలంలోని పలు గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మోరపల్లి రమణారెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి గవ్వ రాజేందర్‌రెడ్డి, నాయకులు కమలాకర్, శ్రీకాంత్, ఎల్లారెడ్డి, సమాద్, చంద్రమౌళి, నోమాన్ పాల్గొన్నారు.

● కరీంనగర్ రూరల్: రైతులకు ఏకకాలంలో 2లక్షల రుణమాఫీపై కేబినెట్ నిర్ణయం తీసుకోవడంతో మండలంలోని నగునూర్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. గత ప్రభుత్వం ఐదు సంవత్సరాల్లో 25వేలకు మించి చేయలేదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు అండగా ఉండే పార్టీ అన్నారు. రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వంపై ఎంతో నమ్మకం పెరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సాయిల్ల రాజు, బత్తిని శ్రీనివాస్‌గౌడ్, గ్రామశాఖ అధ్యక్షుడు తాళ్లపెల్లి శేఖర్, సీనియర్ నాయకులు బత్తిని అంజయ్య,మండల కార్యదర్శి కొత్తకొండ కొమురయ్య పాల్గొన్నారు.



నగునూర్‌లో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ప్రజా సమస్యలు గాలికి వదిలేసిన ఎమ్మెల్యే



విలేకరులతో మాట్లాడుతున్న జడ్పీటీసీ శ్రీరాం శ్యామ్

జమ్మికుంట, జూన్ 24: హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ప్రజా సమస్యలు గాలికి వదిలేసి బూడిద రాజకీయం చేయడం బాధాకరమని జడ్పీటీసీ సభ్యుడు డాక్టర్ శ్రీరాం శ్యామ్ అన్నారు. సోమవారం ఆయన పట్టణంలో విలేకరులతో మాట్లాడుతూ తనను గెలిపిస్తే వెయ్యి కోట్లు తీసుకువచ్చి హుజూరాబాద్ నియోజక వర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. దళిత బంధు లబ్ధిదారుల్లో కొంత మందికి ఐదు లక్షలు మాత్రమే అందాయని, వారి సమస్య ఎప్పుడు పరిష్కరిస్తారో చెప్పాలన్నారు. ప్రెస్‌మీట్లు పెట్టి తిట్టడం తప్ప కౌశిక్‌రెడ్డి నియోజకవర్గానికి చేసింది ఏం లేదన్నారు.

ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపులపై బీఆర్ఎస్ నిరసన



కరీంనగర్‌లో బీఆర్ఎస్ నిరసనను అడ్డుకుంటున్న పోలీసులు



అలుగునూర్‌లో నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు

గణేశ్‌నగర్, జూన్ 24: బీఆర్ఎస్ పార్టీ గుర్తుపై ఎమ్మెల్యేలుగా గెలుపొందిన వారు పార్టీని వీడి, అనుచిత వాఖ్యలు చేయడాన్ని నిరసిస్తూ తెలంగాణ చౌక్‌లో ఆదివారం జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేసే ప్రయత్నం చేయగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో బీఆర్ఎస్ నాయకులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు జీవి రామకృష్ణారావు మాట్లాడుతూ జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌కు రాజకీయ భిక్ష పెట్టింది బీఆర్ఎస్ పార్టీ అన్నారు. ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ పాలనలో అనేక పదవులు పొంది ఇప్పుడు అధికారంలో కాంగ్రెస్ ఉందని పార్టీలో చేరుతున్నారని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు పొన్నం అనిల్, ఆరే రవి, ఎడబోయిన శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

●శంకరపట్నం: శంకరపట్నం మండల కేంద్రంలోని కరీంనగర్-వరంగల్ ప్రధాన రహదారిపై బీఆర్ఎస్ పార్టీ నుంచి ఎమ్మెల్యేలుగా గెలిచి కాంగ్రెస్ పార్టీలో చేరిన పోచారం శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్ సంజయ్‌కుమార్‌ల దిష్టిబొమ్మలను సోమవారం బీఆర్ఎస్ నాయకులు దహనం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు గంట మహిపాల్ మాట్లాడుతూ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్ సంజయ్‌కుమార్‌లు ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ లింగంపల్లి శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

● మానకొండూర్ : బీఆర్ఎస్‌కు చెందిన జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ కాంగ్రెస్ పార్టీలో చేరడాన్ని నిరసిస్తూ మానకొండూర్‌లో సోమవారం మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు తాల్లపల్లి శేఖర్‌గౌడ్ ఆధ్వర్యంలో ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. పల్లెమీద బస్టాండ్ వద్ద సంజయ్‌కుమార్‌కు వ్యతిరేకంగా నినాదాలు దిష్టిబొమ్మను దహనం చేయడంతో రాకపోకలు స్తంభించిపోయాయి. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని రాకపోకలను పునరుద్ధరించారు. కార్యక్రమంలో శేఖర్, సందీప్, ఈశ్వర్‌రెడ్డి, శశి, సత్యనారాయణరెడ్డి ఉన్నారు.

● తిమ్మాపూర్: అలుగునూర్ కూడలి వద్ద జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ దిష్టిబొమ్మను బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కేతిరెడ్డి దేవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం బీఆర్ఎస్ శ్రేణులు దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్తల కష్టంతో, బీఆర్ఎస్ పార్టీ బిఫాంపై జగిత్యాల ఎమ్మెల్యేగా గెలిచిన డాక్టర్ సంజయ్ కుమార్ పార్టీకి ద్రోహం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యకర్తలను, ప్రజలను మోసం చేసిన ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ల్యాగల వీరారెడ్డి, ప్యాక్స్ చైర్మన్ స్వామిరెడ్డి, ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ అశోక్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు మాతంగి లక్ష్మణ్, మండల యూత్ అధ్యక్షులు రాజేందర్, గడ్డి రమేష్, పోతురాజు దేవేందర్ పాల్గొన్నారు.

పాఠశాలలో పుస్తకాలు విక్రయిస్తున్నారని ఎస్ఎఫ్ఐ ధర్నా

కరీంనగర్ రూరల్, జూన్ 24: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా కరీంనగర్ రూరల్ మండలం బొమ్మకల్ పరిధిలోని ఓ పాఠశాలలో పుస్తకాలను అమ్ముతున్నారని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా చేశారు. పాఠశాలలో పుస్తకాలు అమ్ముతూ వ్యాపారం చేస్తున్నారని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శులు కాంపల్లి అరవింద్, గజ్జెల శ్రీకాంత్ అన్నారు. సీబీఎస్ఈ అనుమతులు లేకుండానే అడ్మిషన్లు కొనసాగిస్తున్నారని ఆరోపించారు. విషయం తెలుసుకున్న ఎంఈఓ మధుసూధన్ పాఠశాలను సందర్శించి పుస్తకాలను సీజ్ చేశారు. నిబంధనలు పాటించని ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమం లో జిల్లా ఉపాధ్యక్షుడు రోహిత్, జిల్లా సహాక కార్యదర్శి వినయసాగర్, ఇషాక్, జిల్లా కమిటీ సభ్యులు గట్టు ఆకాష్, రాకేష్, గణేష్, చంటి తదితరులు పాల్గొన్నారు.

డంప్‌యార్డును తొలగించాలి

సుభాష్‌నగర్, జూన్24: నగరశివారులోని కోతిరాంపూర్‌లో గల డంప్‌యార్డును శాశ్వతంగా తొలగించాలని మాసం గణేష్ కోరారు. సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. నగరంలోని 60డివిజన్లకు సంబంధించిన చెత్త, జంతు వ్యర్థాలు, కళేబరాలను విచ్చలవిడిగా డంపింగ్ చేస్తుండటంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు.

ప్రభుత్వ భూముల్లో అక్రమ కట్టడాలు

● అడ్డుకున్న అధికారులు



అక్రమ నిర్మాణాలపై విచారిస్తున్న జీపీ సిబ్బంది

కరీంనగర్ రూరల్, జూన్24: కరీంనగర్ రూరల్ మండలంలోని నగునూర్‌లోని సర్వేనెంబర్ 471లో అక్రమంగా ప్రభుత్వ స్థలాలను కబ్జాచేసి నిర్మాణాలు చేపడుతున్నారని రెవెన్యూ, గ్రామ పంచాయతీకి గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. గ్రామస్థుల ఫిర్యాదు మేరకు సోమవారం పంచాయతీ కార్యదర్శి మల్లయ్య, సిబ్బంది అక్కడికి వెళ్లి పరిశీలిస్తుండగా నిర్మాణాలు చేపట్టిన వ్యక్తి అడ్డుకున్నాడు. స్థలానికి సంబంధించిన పత్రాలు ఏమైనా ఉంటే తీసుకురావాలని లేని పక్షంలో నిర్మాణాలపై చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

విద్యుత్ ప్రజావాణిలో దరఖాస్తులకు తక్షణ పరిష్కారం

● ఎస్ఈ గంగాధర్

గణేశ్‌నగర్.జూన్ 24: విద్యుత్తు వినియోగదారుల కోసం టీజీ ఎన్పీడీసీఎల్ కరీంనగర్ సర్కిల్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విద్యుత్ ప్రజావాణి కార్యక్రమానికి ఎస్ఈ వడ్లకొండ గంగాధర్ హాజరై వినియోగదారుల దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాటిని తక్షణమే పరిష్కారం చేస్తామని అన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో సర్కిల్ ఆఫీస్‌కు 3, దరఖాస్తులు, కరీంనగర్ టౌన్ 03, హుజూరాబాద్ డివిజన్ 2లకు కలిపి 8 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు.తక్షణమే పరిష్కారం కొరకు సంబంధిత సెక్షన్లకు పంపిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి డి ఈ విజేందర్‌రెడ్డి,, ఎస్ఓ రాజేశం, ఏడీ ఈ సురేష్ వీణ తదితరులు పాల్గొన్నారు.

'మెగా జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి'

తిమ్మాపూర్, జూన్ 24: రాష్ట్ర ప్రభుత్వ యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని కొత్తపల్లి సాయిరాం గార్డెన్స్‌లో నిర్వహించే మెగాజాబ్ మేళాను నిరుద్యోగ యువతి, యువకులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఓ ప్రకటనలో కోరారు. 60కి పైగా కంపెనీలు ఐదు వేలకు పైగా ఉద్యోగాలు కల్పించేందుకు జాబ్‌మేళాను ఏర్పాటు చేశామని తెలిపారు. విద్యార్హతతో సంబంధం లేకుండా ఉద్యోగావకాశాలు ఉన్నాయని చెప్పారు. జాబ్ మేళా మానకొండూర్ నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంత యువతకు ఓ సువర్ణ అవకాశమని, భారి సంఖ్యలో యువత పాల్గొని జాబ్‌మేళాను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ కోరారు.

ఇంటర్ విద్యార్థులకు పాఠ్య పుస్తకాల పంపిణీ

కరీంనగర్ టౌన్, జూన్ 24: నగరంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ఫస్ట్, సెకండ్ ఈయర్ చదువుతున్న బాలికలకు కళాశాల ప్రిన్సిపాల్ కె.రవీందర్‌రెడ్డి పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కళాశాల లైబ్రేరియన్ రామ్మోహన్, సతీష్‌రెడ్డి, నయిముద్దీన్, పూజ, మాధవి లత, వెంకట్ రాజిరెడ్డి, శ్రీనివాస్, రాధా కృష్ణ, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

ఇంప్రూవ్‌మెంట్‌లో 'కాకతీయ' విద్యార్థుల ప్రతిభ

హుజూరాబాద్, జూన్ 24: ఇంటర్మీడియట్ ఇంప్రూవ్‌మెంట్ ఫలితాల్లో హుజూరాబాద్ కాకతీయ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చినట్లు ప్రిన్సిపాల్ వేణు మాధవ్, డైరెక్టర్లు సోమవారం తెలిపారు.ఎంపీసీ ఫస్టియర్‌లో గుండేటి నాగలక్ష్మిప్రసన్న, ప్రణీత, వినూత్నకు 467, శ్రీవర్ధన్ 466, బైపీసీలో బొరగాల వైష్ణవి 437, హర్షిణి 435, సీఈసీలో వైష్ణవి 458, జ్యోతి 451 మార్కులు సాధించారన్నారు.

డ్రగ్స్ నిర్మూలనలో పోలీసులకు సహకరించాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న కరీంనగర్ రూరల్ ఏసీపీ వెంకటరమణ

తిమ్మాపూర్, జూన్ 24: డ్రగ్స్ నిర్మూలనలో ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని కరీంనగర్ రూరల్ ఏసీపీ పి వెంకటరమణ కోరారు. జ్యోతిష్మతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్ ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో కరీంనగర్ రూరల్ పోలీసుల సహకారంతో మాదక ద్రవ్యాల వ్యతిరేక అవగాహన కార్యక్రమం కళాశాలలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రూరల్ ఏసీపీ వెంకటరమణ డ్రగ్స్ వల్ల కలిగే దుష్పలితాలను విద్యార్థులకు వివరించారు. డ్రగ్స్, ఆల్కహాల్ మెదడు పనితీరును, జ్ఞాపకశక్తిని ఎలా దెబ్బతీస్తుందో డాక్టర్ శివకుమార్ వివరించారు. డ్రగ్స్‌కు విద్యార్థులు దూరంగా ఉండాలని తిమ్మాపూర్ సీఐ స్వామి అన్నారు. షీటీమ్స్‌పై మహిళా స్టేషన్ ఇన్‌స్పెక్టర్ శ్రీలత అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జ్యోతిష్మతి చైర్మన్ జువ్వాడి సాగర్‌రావు, ఎల్ఎండీ ఎస్ఐ చేరాలు, కళాశాల ప్రిన్సిపాల్ కేఎస్ రావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ప్రణిత పాల్గొన్నారు.

రోడ్డుపై వర్షపు నీరు



హుజూరాబాద్‌లో రోడ్డుపై నిల్చిన వర్షపు నీరు

హుజూరాబాద్, జూన్ 24: పట్టణంలోని డిపో క్రాస్ సమీపంలో నడి రోడ్డుపై వర్షపు నీరు ఆగడంతో ప్రజలు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీలు ఎత్తుగా నిర్మించడంతో వర్షపు నీరు రోడ్లపైకి వస్తున్నాయి. మున్సిపల్ అధికారులు స్పందించి రోడ్డుపై వర్షపు నీరు నిల్వ లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రచారం కోసమే మంత్రిపై కౌశిక్‌రెడ్డి ఆరోపణలు



సమావేశంలో మాట్లాడుతున్న వొడితెల ప్రణవ్

హుజూరాబాద్, జూన్ 24: పబ్లిసిటీ కోసమే మంత్రి పొన్నం ప్రభాకర్‌పై ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఆరోపణలు చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ విమర్శించారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు డబ్బులు వసూళ్లు చేసిన చరిత్ర ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిదన్నారు. సోమవారం హుజూరాబాద్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీగా ఉన్న సమయంలో కౌశిక్‌రెడ్డి అవినీతికి పాల్పడ్డట్లు తమ వద్ద ఆధారాలు ఉన్నాయన్నారు. మంగళవారం ఉదయం చెల్పూర్ హనుమాన్ ఆలయం వద్దకు నిరూపించడానికి తాము వస్తున్నామని, డబ్బులు తీసుకోలేదని కౌశిక్‌రెడ్డి ప్రమాణం చేస్తాడా..? అని ప్రశ్నించారు. కేంద్రం ఆధీనంలో ఉన్న ఫ్లైయాష్ విషయంలో రోడ్డు హైవే అథారిటీ వారు టెండర్ వేసి రవాణా చేస్తుంటే మంత్రికి ఏం సంబంధం ఉంటుందని ప్రశ్నించారు. సమావేశంలో పత్తి కృష్ణారెడ్డి, సొల్లు బాబు, రేణుక, శివ, పుష్పలత, శంకర్, అప్సర్, రవీందర్, కిరణ్, సారంగపాణి, సుశీల, రాధ, అయిలయ్య పాల్గొన్నారు.

ఆధునిక పద్ధతుల్లో వ్యవసాయం

● ఎడ్లు, కూలీల కొరతను అధిగమించేందుకు ట్రాక్టర్‌కు ఆల్ట్రేషన్



ఆల్ట్రేషన్ చేసిన ట్రాక్టర్‌తో రైతు తిరుపతిరెడ్డి

ఇల్లందకుంట, జూన్ 24: కూలీల కొరతను అధిగమించేందుకు ఓ యువ రైతు ట్రాక్టర్‌కు ఆల్ట్రేషన్ చేయించాడు. ఇల్లందకుంట మండలంలోని బోగంపాడు గ్రామానికి చెందిన రైతు యాళ్ల తిరుపతిరెడ్డికి ఐదెకరాల వ్యవసాయ భూమి ఉంది. ప్రస్తుత పరిస్థితుల్లో వ్యవసాయ పనులు చేయడానికి కూలీల కొరత ఏర్పడుతుంది. దీన్ని అధిగమించేందుకు తనకు ఉన్నటువంటి ట్రాక్టర్‌కు ఆల్ట్రేషన్ చేయించాడు. సన్నని టైర్లు బిగించాడు. కలుపు తీసేందుకు పరికరాలు బిగించాడు. పత్తి మొక్కలు ఎంత ఎత్తున్నా ఈ ట్రాక్టర్‌తో గుంటుక తోలొచ్చు. పురుగుల మందు పిచికారీ చేయొచ్చు. అచ్చు కొట్టవచ్చు. ఈ పరికరాల కోసం 2.5 లక్షల రూపాయలు ఖర్చు చేశారు. ఈ ట్రాక్టర్‌తో గంటకు ఐదెకరాల్లో పురుగుల మందు స్ప్రే చేయవచ్చు. పత్తి చేనులో కలుపు తీసేందుకు తక్కువ సమయం పడుతుంది. ఎడ్లతో గుంటుక కొట్టడానికి ఎకరానికి 1,500 రూపాయలు ఖర్చు అయ్యేది. ఈ ట్రాక్టర్‌తో గంటలో వెయ్యి రూపాయలతో ఐదెకరాల్లో గుంటుక కొట్టవచ్చు. పురుగుల మందు స్ప్రే చేయడానికి ఒక మనిషికి రోజుకు 800 రూపాయలు ఇవ్వాల్సి ఉంటుంది. ఈ ట్రాక్టర్‌తో స్ప్రే చేస్తే 450 రూపాయలు ఖర్చు అవుతుంది. తిరుపతిరెడ్డి ఈ ట్రాక్టర్‌ను సోమవారం గ్రామానికి తీసుకురావడంతో రైతులు ఆసక్తిగా గమనించారు.

● కూలీల కొరత అధిగమించడానికి..

- యాళ్ల తిరుపతిరెడ్డి, రైతు, బోగంపాడు

ప్రస్తుత పరిస్థితుల్లో వ్యవసాయ పనులు చేసేందుకు కూలీల కొరత ఉంది. దానిని అధిగమించేందుకు ట్రాక్టర్‌కు ఆల్ట్రేషన్ చేయించాను. ఈ ట్రాక్టర్‌తో పలు పనులు సులువుగా చేయొచ్చు.

జాతీయస్థాయి ఇన్‌స్పైర్ మనక్‌కు పారమిత విద్యార్థి ఎంపిక

కరీంనగర్ టౌన్, జూన్ 24: జాతీయస్థాయి ఇన్‌స్పైర్ మనక్ సైన్స్ ఎగ్జిబిషన్‌కు జిల్లా కేంద్రంలోని పారమిత హెరిటేజ్ విద్యార్థిని శుభశ్రీ సాహూ రూపొందించిన శాస్త్రీయ ఆవిష్కరణ ఎంపికైంది. డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, ఎన్ఐఎఫ్ సహకారంతో నిర్వహిస్తున్న ఈ పోటీల్లో జిల్లా నుంచి ఎంపికైన ఏకైక విద్యార్థిని శుభశ్రీ మాత్రమే కావడం గమనార్హమని పారమిత విద్యాసంస్థల అధినేత డాక్టర్ ఇ.ప్రసాద్‌రావు హర్షం వ్యక్తం చేశారు. శుభశ్రీని జిల్లా విద్యాధికారి జనార్ధన్‌రావు, జిల్లా సైన్స్ అధికారి జయపాల్‌రెడ్డి అభినందించారు. పారమిత డైరెక్టర్లు ప్రసూన, అనూకర్‌రావు, రశ్మిత, ప్రాచీ, రమణ, రాకేశ్, వియుఎం ప్రసాద్, వినోద్‌రావు పాల్గొన్నారు.

దళితుల అభివృద్ధికి పాటుపడాలి

కరీంనగర్ అర్బన్, జూన్ 24: దళితులు అన్ని రంగాలలో అభివృద్ధి చెందేలా షెడ్యూల్ క్యాస్ట్ డెవలప్‌మెంట్ డిప్యూటీ డైరెక్టర్ కృషి చేయాలని కాంగ్రెస్‌పార్టీ రాష్ట్ర ఎస్సీసెల్ సీనియర్ వైస్‌చైర్మన్ వెన్న రాజమల్లయ్య కోరారు. షెడ్యూల్ క్యాస్ట్ డెవలప్‌మెంట్ డిప్యూటీ డైరెక్టర్‌గా పదోన్నతి పొందిన ఎండి హమీద్‌ను సోమవారం వెన్న రాజమల్లయ్య మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు.

నియామకం

కరీంనగర్ అర్బన్, జూన్ 24: యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఆకుల ఉదయ్‌ను నియమిస్తూ యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పడాల రాహుల్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఉదయ్‌కు డీసీసీ కార్యాలయంలో నియామక పత్రాన్ని అందజేశారు.

● సుభాష్‌నగర్:ఇంటర్నేషనల్‌హ్యూమన్‌రైట్స్ కాన్ఫెడరేషన్(ఐహెచ్ఆర్సీ) ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షునిగా మహమ్మద్ లాయక్ అలీని నియమిస్తూ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి మాతంగి హన్మయ్య ఉత్తర్వులు జారీ చేశారు.

రేకుర్తి శివారులో పెట్రోలింగ్ నిర్వహించాలి

భగత్‌నగర్,జూన్24: నగర శివారు రేకుర్తిలో దొంగతనాల బెడద ఎక్కువైందని ప్రతిరోజు పోలీసులు పెట్రోలింగ్ నిర్వహించాలని బీజేపీ రాష్ట్ర ఎస్సీ మోర్చా కార్యదర్శి జాడి బాల్‌రెడ్డి కోరారు. రేకుర్తి 18వ డివిజన్ కాళోజీనగర్ పోచమ్మ దేవాలయం దగ్గర అక్షయ కాలనీలో ఇళ్లలో ఆదివారం తెల్లవారు జామున దొంగల ముఠా మూడు ఇళ్లలో చొరబడి నగలు డబ్బులు దోచుకెళ్లారని తెలిపారు.

ప్రభుత్వ భూమిని కాపాడాలి

సుభాష్‌నగర్, జూన్24: అన్యాక్రాంతమవుతున్న ప్రభుత్వ భూమిని కాపాడాలని భీం ఆర్మీ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ బోయినిపెల్లి చంద్రయ్య కోరారు. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కొత్తపల్లి మండలంలోని చింతకుంట గ్రామంలో గల శాంతినగర్‌లోని 439 సర్వేనెంబర్‌లో గల ప్రభుత్వ భూమిని ప్రజల సౌకర్యంగా మినీ మార్కెట్, బస్టాండ్ కోసం కేటాయించారని తెలిపారు. ఈ స్థలాన్ని భూకబ్జాదారులు దౌర్జన్యంగా ఆక్రమించుకుని గత ప్రభుత్వంలోని రాజకీయనాయకుల అండదండలతో ఆ భూమిని కబ్జా చేసి భవనాన్ని నిర్మించా రని ఆరోపించారు. అధికారులు దీనిపై పూర్తి స్థాయిలో విచారణ జరిపించాలని కోరారు.

కరాటే పోటీల్లో ప్రతిభ

కరీంనగర్ స్పోర్ట్స్, జూన్ 24: ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని బిలాస్‌పూర్‌లో ఈ నెల 22, 23 తేదీల్లో నిర్వహించిన జాతీయ స్థాయి ఓపెన్ కరాటే పోటీల్లో జిల్లా కేంద్రానికి చెందిన కాంటినెంటల్ షోటోకాన్ కరాటే డో ఇండియా జాతీయ అకాడమీ క్రీడాకారులు పాల్గొని పలు పతకాలు సాధించారని సీఎస్‌కేఐ చీఫ్, కరాటే అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఈ శ్రీనివాస్ తెలిపారు. అబో-18 విభాగంలో బీ అనూష ఒక బంగారు పతకం, వై విశ్వక్‌సేన్ ఒక బంగారు, ఒక కాంస్య, పి శ్రేయాన్స్ నారాయణ్ రెండు బంగారు పతకాలు సాధించారని పేర్కొన్నారు.

● సంక్షిప్త సమాచారం..

● కరీంనగర్ కల్చరల్: నగరంలోని భగత్‌నగర్ జెడ్‌పి క్వార్టర్స్ ఆవరణలోని ప్రాచీన శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం శ్రీవారి కల్యాణాన్ని కన్నుల పండువలా నిర్వహించారు. కార్యక్రమంలో మేయర్ యాదగిరి సునీల్‌రావు, జెడ్‌పి చైర్‌పర్సన్ కనుమల్ల విజయ, మేయర్ సతీమణి అపర్ణ, విజయభాస్కర్, ఈఓ కొన్న కాంతారెడ్డి పాల్గొన్నారు.

● హుజూరాబాద్: పట్టణంలోని హైస్కూల్ మైదానంలో క్రీడా పాఠశాలలో ప్రవేశాలకు ఎంపిక పోటీలు నిర్వహించారు.

- పట్టణంలోని బాలికల హాస్టల్ ఎదురుగా రోడ్డును అక్రమించి అక్రమంగా నిర్మించిన పునాదిని మున్సిపల్ అధికారులు కూల్చివేశారు.

-హుజూరాబాద్ డివిజన్‌లోని ప్రైవేట్ పాఠశాల యాజమాన్యాలు అధిక ఫీజులు వసూళ్లు చేస్తున్నా డీఈవో, హుజూరాబాద్ ఎంఈవోలు పట్టించుకోవడం లేదని టీవీయూఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కర్ర శ్రీధర్‌రెడ్డి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

● వీణవంక: క్రీడా పాఠశాలల్లో ప్రవేశం కోసం మండల స్థాయి ఎంపిక పోటీలు ఈ నెల 26న వీణవంక జిల్లా పరిషత్ పాఠశాల మైదానంలో నిర్వహిస్తున్నట్లు ఎంఈవో విడపు శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు.

● చొప్పదండి, జూన్ 24: చొప్పదండిలోని వీణాదరి స్కూల్ 1995-96 సంవత్సరానికి చెందిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు.

- సమస్యలను పరిష్కరించాలని ఈనెల 26న కలెక్టరేట్ ఎదుట నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని తెలంగాణ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్, సీఐటీయూ రాష్ట్ర ప్రదాన కార్యదర్శి జనగాం రాజమల్లు కోరారు.

● శంకరపట్నం: తల్లిదండ్రులు పిల్లల ఎదుగుదలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ప్రత్యేక శ్రద్ధ వహించాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ స్రవంతి అన్నారు. సోమవారం మండలంలోని కన్నాపూర్, ధర్మారం గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో గ్రోత్ మేళా నిర్వహించారు.

● తిమ్మాపూర్: అలుగునూర్‌లోని 8వ డివిజన్ కార్యాలయ ఆవరణలో పిల్లల ఎత్తు, బరువుకు సంబంధించి మేళా నిర్వహించారు. పిల్లల పెరుగుదలను పరిశీలించారు.

● జమ్మికుంట రూరల్: అధికార కాంగ్రెస్, ప్రధాన ప్రతిపక్షంగా బీఆరెస్ నాయకులు ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకోవడం తప్ప చేసిన అభివృద్ధి ఏం లేదని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎరబెల్లి సంపత్‌రావు ఓ ప్రకటనలో విమర్శించారు.

● మానకొండూర్: ఉపాధ్యాయులు విద్యార్థుల సామార్థ్యాలను పెంపొందించాలని డీఈవో జనార్దన్‌రావు అన్నారు. మండలంలోని అన్నారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సోమవారం ఆయన సందర్శించారు.

- మానకొండూర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1986-87 పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల కార్యవర్గాన్ని ఎన్నుకన్నారు. గౌరవాధ్యక్షుడిగా జి వెంకటేశ్వర్లు, అధ్యక్షుడిగా గోశెట్టి సత్యనారాయణ, ఉపాధ్యక్షులుగా పాకాల రాంరెడ్డి, ఇరుగురాల ఎల్లయ్య, కార్యదర్శిగా నందగిరి మల్లేశం, సంయుక్త కార్యదర్శి వేణు, కోశాధికారి శ్రీనివాస్ ఎన్నికయ్యారు.

● రామడుగు: మండల కేంద్రంలోని సోమవారం మండల స్థాయి క్రీడా పోటీలు ప్రారంభం అయ్యాయి. ఈ పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను జిల్లా స్థాయికి ఎంపిక చేసినట్లు ఎంఈవో వేణు తెలిపారు.

- మండలంలోని గోపాల్‌రావుపేట గ్రామానికి చెందిన దాసరి మల్లేశం ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. ఆయనకు ముగ్గురు కుమార్తెలుండగా చిన్న అమ్మాయికి ఏడాది స్కూల్ ఫీజు, మరో ఇద్దరికి నోటు పుస్తకాలను ముదిగంటి సేవా సంస్థ అధ్యక్షులు దాసరి కనుకయ్య, ప్రధాన కార్యదర్శి దాసరి రవిశాస్త్రి, గౌరవ అధ్యక్షులు ఒద్దుల హనుమంతరెడ్డి అందజేశారు.